**శారీరక, మానసిక, బౌద్ధిక లక్షణాలచేత మానవులకూ జంతువులకూ తేడా వుంటుందంటుంది సైన్సు. అయితే, వాస్తవ జీవితంలో అలా వుందనిపిస్తోందా?**

ఆంధ్రా అసోసియేషన్‌వాళ్ళు ఎలెన్‌ఫారెస్ట్‌కి పిక్నిక్ ఏర్పాటు చేస్తున్నారని వచ్చి చెప్పాడు రవిచంద్ర భార్యకి. పద్మకి సంతోషంలాంటిది కల్గింది. ఈ కాన్పూరు ఐ ఐ టి.కి వచ్చాక పద్మకి కాలం స్తంభించిపోయినట్టుగా వుంది. ఇంటిదగ్గర తల్లి, తండ్రి, అన్నయ్యలు, చెల్లెళ్ళ మధ్య గడిపి, భర్తతో మళ్ళా కాన్పూరు వస్తే ఆమెకి ఎడారిలోకి వచ్చినట్టుగా వుంటుంది.

భర్త చదువు యింకా రెండు సంవత్సరాలు వుంది. చుట్టుపక్కల చాలా మంది తెలుగువాళ్ళు స్నేహితులైనా సరే, పద్మకి ఎందుకో ఒంటరితనంగా అనిపించింది అక్కడికి పనిమనిషిని పెట్టుకోకుండా తన పనంతా తనే చేసుకునేది! యిద్దరి పని ఏమాత్రం వుంటుంది?

వంట అంట్లు కడగడం, బట్టలుతకడం, మిగిలిన కాలమంతా ఏంచెయ్యాలో తోచేది కాదు. కొన్నాళ్ళు క్రిందవాళ్ళని అడిగి స్వెట్టర్లు అల్లడం నేర్చుకుని రెండు మూడు అల్లింది. కొన్నాళ్ళకి అదీ విసుగు పుట్టింది. ఆంధ్రా అసోసియేషన్ వాళ్ళ ధర్మమా అని అప్పుడప్పుడు తెలుగు సినిమాలు చూసే అవకాశం వుంది.



# ఎలెన్ ఫారెస్టు

**ముక్కామల వసుంధరాదేవి**

వాళ్ళు ఏరి ఏరి పాత సినిమాలు- మాయాబజార్, గుండమ్మకథ లాంటివి తెప్పిస్తే అంతకు ముందు అవి యెన్నిసార్లు చూసినవైనా మళ్ళా యెంతో ఆత్రుతగా వెళ్ళిపోవడం యిక్కడి తెలుగువాళ్ళకి అలవాటు. "తెలుగువాళ్ళంతా కలుసుకుంటే యెంత బాగుంటుందో?" అనుకుంది పద్మ. పద్మ యెప్పుడెప్పుడా అని యెదురు చూసిన రోజు రానే వచ్చింది. పైగా ఉదయమే లేచి టిఫిన్ చెయ్యడంలాంటి హడావుడి లేకుండా వాళ్ళే భోజనం వగైరాలు ఏర్పాటు చేస్తారని విని హాయి అనిపించింది.

పిక్నిక్ రోజు ఉదయం పద్మ ఎనిమిది కల్లా రెడీ అయిపోయింది. ఐ. ఐ. టి. వాళ్ళ బస్ పది గంటలకు వచ్చింది. అంతకు ముందు రెండు ట్రిప్పుల్లో కొంత మంది తెలుగువాళ్లు వెళ్ళిపోయారు. మూడో ట్రిప్ వాళ్ళతో పద్మ రవిచంద్ర బయల్దేరారు. రవి అంతకు ముందు సిటీలో ఫొటో రీల్స్ కొనడం మర్చిపోలేదు రెండు రీల్స్ కొన్నాడు. బస్‌స్టాండ్‌కి రాగానే పద్మ అక్కడనుంచున్న ఆడవాళ్ళవైపు, రవిచంద్ర మగవాళ్ళవైపు చీలిపోయారు.

అక్కడవున్న ఆడవాళ్ళ కళ్ళు పద్మని ఒక్కసారి పరికించి చూశాయి.

"హలో" అని చాలామంది పద్మని పలకరించారు. పద్మ అందర్నీ చిరు

నవ్వుతో విష్ చేసి ఒక మూలగా వొదిగి నుంచున్న మీనాక్షి దగ్గరకి వెళ్ళింది- "బాగున్నారా ?" అంటూ. మీనాక్షి బిడియంగా తల వూపింది. ఆమెకి ఎవరితో మాట్లాడాలన్నా, పది మందితో కలవాలన్నా సిగ్గు, మొహమాటం. అందరూ నవ్వుతూ మాట్లాడుకుంటూంటే ఏం చెయ్యాలో తోచని పసిపిల్లలా బిక్క మొహం వేసుకుని దిక్కులు చూస్తూంది. చాలా మంది తెలుగువాళ్లు పద్మకి ఆమె గురించి 'ముంగి'అనీ 'గర్విష్టి' అనీ ఎవ్వరితో కలవదనీ చెప్పారు. పద్మకి ఆమెను చూస్తే అలా అనిపించదు. ఆవిడ భర్త ఆమెకి పూర్తిగా విరుద్ధం. ఎప్పుడూ నవ్వుతూ సరదాగా జోక్సు వేస్తూ కొత్తవాళ్ళతో యిట్టే కలిసిపోతాడు అతని చుట్టూ ఎప్పుడూ ఒక గుంపు వుంటుంది. అతని మాటలు ఎవరికైనా ఆసక్తిగా వినాలనిపించేలా వుంటాయి. పద్మ కళ్ళు మీనాక్షితో మాట్లాడుతూనే మగవాళ్ళ గుంపువెపు చూశాయి. రవిచంద్ర అప్పటికే గాగుల్స్ పెట్టుకున్నాడు. అది ఎండ గురించి కాదని పద్మకి తెలుసు. రవిచంద్ర కళ్ళు గాగుల్స్‌లో దాక్కున్నా అతని చూపులు యిప్పుడు ఎక్కడ వున్నాయో పద్మ గ్రహించగలదు. పద్మకి నాలు గడుగుల దూరంలో నీలిరంగు బెల్‌బాటం పేంటు, తెలుపు స్లీవ్ లెస్ జాకెట్, పెదవులకి లిప్‌స్టిక్, బాబ్డ్ హెయిర్‌తో ప్రొఫెసర్ నీలకంఠంగారి అమ్మాయి మధురిమ నుంచునివుంది. ఆమె గుండెలు ఎత్తుగా, ఆ లోనెక్ జాకెట్‌లోంచి కనీ కనిపించకుండా తొంగిచూస్తున్నాయి.

"అందాన్ని కోరుకోవడంలో తప్పులేదు" అంటాడు రవిచంద్ర.

"అలాగని ప్రతి అందాన్ని కోరితే పెళ్ళెందుకు ?" అంటుంది పద్మ.

"ఈ లైఫ్ శాశ్వతం కాదు. బతికినన్నాళ్లు హాయిగా అనుభవించాలి. ఎవడికో ఎందుకు భయపడి చావాలి ? నీకు వుండడానికి యిల్లు, బతకడానికి డబ్బు, నీ సరదాలు తీర అన్ని చీరెలు నగలు కొంటున్నాను. ఇంకా భార్యగా నీకేం యివ్వాలి ? నా మార్గానికి నువ్వెందుకు అడ్డు రావాలి? నా సరదాలు నావి. నాకు విస్కీ, బీరు యిష్టం. పేకాడం యిష్టం. అందం అంటే యిష్టం...." అంటాడు రవిచంద్ర.

"డబ్బు, నగలు, చీరెలు కావులైఫంటే. భర్త ప్రేమ పూర్తిగా తనకే వుండాలని ప్రతిభార్యా కోరుకుంటుంది, అది లేనినాడు మీరు ఎన్ని యిచ్చి ఏం ప్రయోజనం ?" ఈ మాటలు పద్మ పైకి అనకుండా మనసులోనే వుంచుకుంది. తర్వాతి జవాబు


ఆనందజ్యోతి లో కొత్త సీరియల్స్
సచిత్ర వారపత్రిక
ప్రముఖ రచయిత డా॥ కొమ్మూరి వేణుగోపాలరావు
కడుపుబ్బ నవ్వించే నవ యువ రచయిత "రఘు"
ఏజెంట్లు లేని చోట ఏజెంట్లు కావలెను
రచనలు త్వరలో ప్రారంభం
ఆనంద జ్యోతి గవర్నర్ పేట విజయవాడ-2

"వనితా జ్యోతి" చదవండి!

## క్యాన్సరు విముక్తి

నా పేరు శారదమ్మ. వయస్సు 45 సంవత్సరములు. సంతానము లేమంది. ప్రారంభములో తెల్లబట్ట మరియు మలము ద్వారా తెలుపు పోవుచుండెను. అప్పుడు తుంకూరు జనరల్ ఆస్పత్రికి వెళ్ళి డాక్టర్లకు చూపించాను. వారు క్యాన్సరు ఆసుపత్రికి వెళ్ళమని సలహా యిచ్చారు. బెంగుళూరులో క్యాన్సరు నిపుణులు నన్ను పరీక్షించి, గర్భకోశానికి క్యాన్సరు అయినట్లు తెలిపిరి. 30 రోజులు కరెంటు ట్రీట్‌మెంటు కూడా యిచ్చిరి. ఎన్నిచేసినా ఏమి ప్రయోజనం లేకపోయింది. తుదకు డాక్టర్ యం. బాబూరావుగారి ఆయుర్వేద చికిత్సతో క్యాన్సరు నుండి విముక్తి చెంది సంపూర్ణ ఆరోగ్యమును పొందిన ఒక వ్యక్తి యొక్క ప్రకటన పత్రికలో చదివి నేను కూడా డాక్టర్ యం. బాబూరావుగారిని సంప్రదించి 12 వారములు చికిత్స పొందాను. తరువాత మళ్ళీ నేను క్యాన్సరు నిపుణులతో పరీక్ష చేయించుకొనినాను. వారు నన్ను పరీక్షించి నాలో క్యాన్సరు లక్షణాలు లేవని చెప్పిరి. ఇలాంటి భయంకర వ్యాధి నుండి నన్ను రక్షించినందుకు నేను మరియు నా కుటుంబం డాక్టర్ యం. బాబూరావుగారికి ఎంతో ఋణపడి ఉన్నాము. ప్రకటించినవారు :

శారదమ్మ, భర్త పేరు శ్రీకంఠయ్య
మధుగిరి, తుంకూరుజిల్లా (కర్ణాటక)

| డాక్టరుగారి అడ్రసు | పని చేయు రోజులు |
|---|---|
| * డా. యం. బాబూరావు (క్యాన్సర్ ఇన్ పర్మరి) ఇంటి నెం. 1-1-271/3 చిక్కడపల్లి, హైదరాబాద్-20. ఫోన్ : 64735. | ప్రతి గురువారము శుక్రవారము |
| * C/o హోటల్ సుధారా, ఉస్మాన్ రోడ్, టి.నగర్ మద్రాసు-17, ఫోన్: 445164 | ప్రతి శనివారము |
| * C/o బృందావన్‌హోటల్ యం. జి. రోడ్. బెంగుళూర్-1, ఫోన్ ; 53271. | ప్రతి ఆదివారము |
| * C/o హోటల్ మిడ్-టౌన్, రైల్వేస్టేషన్ ఎదురుగా అంధేరి (వెస్ట్) బొంబాయి. ఫోన్ : 565734. | ప్రతి బుధవారము |

ఆమెకి తెలుసు." నీ ఖర్మ! నోరు మూసుకుని పడుండు." అంటాడు.

"మీరు అదృష్టవంతులండీ" అని ఎవరైనా అంటే పద్మకి దిగులు కల్గుతుంది. మనుష్యుల పైపై జీవితాలు చూసి అదృష్టవంతులనుకోవడం ఎంత పిచ్చితనం? ఎవరి జీవితంలో ఏముందో ఎవరికి తెలుసు అనుకుంటుంది. ఆడపిల్ల "ఎవడో ఒకడు! పెళ్ళయితే చాలు!" అని కోరుకునే రోజులివి! అందం, ఆస్తి, చదువు, వయసు వీటిల్లో అన్నీవున్న వాళ్ళు, ఏదో ఒకటి వున్నవాళ్లు, ఏదీ లేని వాళ్లు ఎందరో ఈ రోజుల్లో అవివాహితలుగా మిగిలిపోతున్నారు. ఆడపిల్ల జీవితంలో అదృష్టం అనేది ఈ పెళ్ళిమీద ఆధారపడుతుందేమో! నెమ్మదస్తులకి గయ్యాళి భార్య. నమ్రతగల భార్యలకి తన్నే తాగుబోతు భర్తలు, విశాల హృదయం కలవాళ్ళకి అనుమానపు పెళ్ళాలూ, పిసినారి భార్యలకి విచ్చలవిడిగా ఖర్చు చేసే భర్తలు, అందమైనవారికి అనాకారి భార్యలూ.... దేవుడు ఎవరెవరికి ఎంత చిత్రంగా ముడిపెడతాడో చెప్పలేం!

అలాగే శీలంలేని వాళ్ళ పట్ల చిన్న చూపువున్న పద్మకి వయసులోవున్న ఆడపిల్ల కనిపిస్తే వెర్రిగా విరగబడి చూసే రవిచంద్ర భర్త!

"హలో పద్మగారూ!" అంటూ పలకరించాడు మీనాక్షి భర్త - రావు.

"ఏమిటి కథ? మీ ఆయన స్మార్ట్‌గా తయారయ్యారు?" అన్నాడు.

"మీరు తక్కువ తినలేదుగా? చుట్టూ యింత అందంగా కలర్‌ఫుల్‌గా వుంటుందని తెలిసి...." పద్మ నవ్వింది.

"భలేవారు! ఆ విషయంలో నేను శ్రీరామచంద్రుడికి తమ్ముణ్ణండోయ్! ఈ కలర్స్ నాకు పట్టవు. మా సీతాదేవి చాలు నాకు" అని మీనాక్షి వైపు చూసి నవ్వాడు.

"పైకి అలాగే అంటారు. లోపల మాత్రం పెళ్లాం తాటకే!" అంది పద్మ.


"మీవారి కేమోగానీ, నాకు మాత్రం మా ఆవిడ సీతేనండోయ్" అన్నాడు.

పద్మ మనసు క్షణం చివుక్కుమంది.

"మా ఆయనెప్పుడూ మీలాగా సరదాగా వుండమని అడుగుతూ వుంటారు నన్ను" అంది మీనాక్షి.

బస్ రానేవచ్చింది. పద్మకి కిటికీ ప్రక్క సీట్ దొరికింది. ప్రక్కనే లీలావతి వచ్చి కూర్చుంది. ఆవిడ అసిస్టెంట్ ప్రొఫెసర్ శేషాద్రిగారి భార్య. ఆయన పొట్టిగా, లావుగా బట్టతలతో కళ్ళద్దాలలోంచి ప్రపంచాన్ని భయం భయంగా చూస్తున్న చిన్న పిల్లవాడిలా వున్నాడు. లీలావతి తెల్లగా వున్నా విపరీతమైన ఒళ్ళు, చిన్ని కళ్ళు. పల్చని వుల్లిపొరలాంటి చీరె కట్టుకుంది. అందులోంచి యెత్తుగా వున్న పొట్టా, తెల్లని జాకెట్లోంచి బ్రాసరీ, లంగా స్పష్టంగా కనిపిస్తున్నాయి. పద్మకి ఆవిడనిచూస్తే యింగ్లీషు సామెత గుర్తు వచ్చింది.

"ఆకర్షణీయంగా కన్పించాలని ప్రయత్నించే ఆడది ఎప్పటికీ అందంగా వుండలేదు. అందమైన ఆడదానికి వేరే ఆకర్షణ అవసరంలేదు?" అంతవయసువుండి, భర్త అంత గౌరవనీయమైన స్థానంలోవున్నా ఆవిడ అంత ఎబ్బెట్టుగా వస్త్రధారణ ఎందుకు చేసుకుంది అనుకుంది పద్మ.




ఎదుటి సీట్లో నీరజ కూర్చుని వుంది. ఒళ్ళంతా పైటతో కప్పుకుని వుంది.

"మా ఆయనతో చచ్చిపోతున్నానండీ బాబూ! అన్నిటికీ చంపుతారు. ఎవరివైపు చూసినా "అదుగో వాడివైపు చూస్తున్నావు. నీ బుద్దే అంత. మీ వంశమే అంత" అంటారు. పైట వదిలేస్తే 'బజారుదాని లాగా ఏమిటా వేషాలు' అంటారు. మా ఆయన లాంటి ఆయన్ని పెళ్ళి చేసుకునే కన్నా ఏ నుయ్యో గొయ్యో చూసుకోవడం మేలు" అంటుంది నీరజ. నీరజ భర్త చైనావాడిలా చీపి కళ్ళతో ఆడవాళ్ళని పట్టి పట్టి చూస్తున్నాడు. మధ్య మధ్య భార్య వైపు చూస్తున్నాడు. పద్మ దృష్టి మళ్లా రవిచంద్ర వైపు మళ్ళింది. రవిచంద్ర నిలబడి ఎవరితోనో వినయంగా మాట్లాడుతున్నాడు. ఆయన తన వంక చిఱునవ్వుతో చూసి మొహం తిప్పుకోవడం చూసి ఆయన్ని గుర్తించిందిపద్మ. ఆయన రవిచంద్ర ప్రొఫెసర్ గోపాలరావు. నలుపు సూటుతో సన్నగా, పొడుగ్గా, గంభీరంగా వున్న ఆయనకి యాభై మూడేళ్ళు అంటే ఎవ్వరూ నమ్మరు. బ్రహ్మచారి. ఎందువల్లో ఆయన పెళ్ళి చేసుకోలేదు. ఆడవాళ్ళతో ముక్తసరిగా మాట్లాడతాడు. ఎలాంటి వాళ్లైనాసరే ఆయనకి గౌరవం యివ్వకుండా వుండలేరు. ఆయన మాట్లాడితే ఖంగుమనిపిస్తూ వుంటుంది స్వరం. ఠీవిగా, హుందాగా కనిపిస్తారు ఎప్పుడూ. ఆయన్ని చూస్తే ఈయన ఎప్పుడైనా దుఃఖం అనేది అనుభవించాడా అని అనుమానం వస్తుంది.

"ఒక సిగరెట్టుంటే యిలా పడెయ్యండి!" అని రాఘవరావు పక్కసీట్లో ఆయన్ని అడుగుతున్నాడు. పద్మ ముందు సీట్లోవున్న రాఘవరావువైపు చూస్తోంది. అతను స్కూములో పనిచేస్తున్నాడు. నెలకి వెయ్యిరూపాయలుదాకా వస్తాయి. అయినా సరే పైసా ఖర్చుపెట్టడు. మధ్యాహ్నం ఎవరింటికో వెళ్ళి "టీ నీళ్లు పోస్తారా, లేదా?" అని జబర్దస్తీగా అడుగుతాడు. అతని స్వభావం అందరికీ తెలుసు. చాలామందికి అతనంటే అసహ్యం. అందరిచేత ఖర్చు పెట్టించాలని చూస్తాడు. అతని భార్యని చూస్తే అందరికీ జాలే! ఎప్పుడూ ఆమె తండ్రినడిగి డబ్బు తెమ్మని పుట్టింటికి పంపేస్తూ వుంటాడు. మాట్లాడితే విడాకులిస్తానంటాడు. ఇద్దరు పిల్లల తండ్రి!

"పెళ్ళి పెళ్ళి అనుకుంటాంగానీ పెళ్ళిలో సుఖం లేదే! ఇదొక వూబి!" అనేది పద్మ స్నేహితురాలు జానకితో. జానకి తల్లి

# శబ్దార్థ చంద్రిక

జీనియస్ : జాక్‌పాట్ కొట్టే క్రేక్ పాట్. పిల్లలకు హోంవర్క్ చేసి పెట్టే తల్లి లేదా తండ్రి ఎవరో ఒకరు.

తొలి ప్రయత్నంలోనే పనులు తగలెయ్యకుండా తిన్నగా చేసేవాడు.

కాస్మటిక్స్ : అప్లయిడ్ ఆర్ట్.

కమ్యూనిజం: సోషలిజం విత్ ఎ గన్.

ఉల్లిపాయ : కలకంఠి కంట కన్నీరొలికించే ఉపాయ(ం).

ఆప్టిమిస్టు : పులుసులోపడి ఈత నేర్చుకుంటున్నా ననుకునేవాడు.

న్యూరోటిక్ : ఆకాశహర్మ్యాలు నిర్మించే వాడు.

సైకోటిక్ : అందులో నివసించేవాడు.

నైట్‌గవున్ : నిద్ర సంచీ.

మొనాటనీ : ఒక మనిషికి ఒకేభార్యను అనుమతించే పద్ధతి.

కిల్లింగ్ టైమ్ : వాయిదాల పద్ధతిమీద ఆత్మహత్య.

ఇంటలెక్చువల్ : కాబెరా నృత్యం జరుగుతుండగా శబ్దరత్నాకరం చూసేవాడు.

యూత్ : అనుభవ రాహిత్యానికి మరో పేరు.

ఆవలింత : ఒకరు నోరు తెరవగానే మిగతా వారు నోరు మూసుకోవాలనే కోరికకు సూచన.

జూ : మనుషుల్నుంచి మృగాలను కాపాడి దాచేచోటు.

ప్రాపగాండా : అవతలివాళ్ళు చెప్పే అబద్ధాల పరంపర.

పేషన్స్ : వాయిదాపడిన టెంపర్.

దేశభక్తి : అన్య దేశీయులు ఏ ఆటలోనైనా మన దేశం వచ్చి ఛాంపియన్‌షిప్ గెలుచుకున్నపుడు మనలో కలిగేది.

ఓల్డు ఏజి : పెళ్ళాం ఎక్కడికి వెళ్ళినా పట్టించుకో నవసరంలేని వయసు. కూడా వెళ్ళనవసరంలేని వయసు.

---

స్కూలు టీచరు. భర్త లేదు. ఆవిడకి వూళ్ళో అంత మంచి పేరు లేదు. అనుకోకుండానే పద్మకి జానకి ఆప్తమిత్రురాలైంది. జానకిగురించి, ఆమె తల్లి గురించి వూరంతా చెడుగా చెప్పుకునేవారు. పద్మ నిలదీసి అడిగితే జానకి ఏడ్చి నిజం చెప్పింది. అప్పుడప్పుడు జానకి యింటి మీదుగా సైకిల్‌మీద వెళ్ళే ముప్పై అయిదేళ్ళ అతణ్ణి చూపించింది.

"వాడి పేరు సూర్యం. అమ్మకోసం వచ్చివాడు మొదట. వాడంటే నాకసహ్యం. అలా అంటే అమ్మ కొట్టేది. ఏ కూరలు చేసినా వాడి రూముకి వెళ్ళి యిచ్చి రమ్మని చెప్పేది. వాడు నెలకు సగం రోజులు మాయింట్లోనే భోజనంచేసేవాడు. ఒక రోజు యిలాగే అమ్మ లేనప్పుడు వచ్చాడు. నేను ఎంత ఏడ్చినా వినకుండా- నిజంగా పద్మా! అప్పటిదాకా నాకు మగవాళ్ళతో పరిచయం లేదు. వాడే బలవంతంగా లొంగదీసుకున్నాడు. తర్వాత అమ్మకి ఏం చెప్పాడో, ఎలా బెదిరించాడో, అమ్మ నన్ను బలవంతంగా వాడి రూములో తోసి తలుపు వేసేది. నాకు చావు అంటే భయం పద్మా! ఎక్కడికైనా పారిపోవాలనిపించేది. కానీ కొన్ని కథలు, అలా పారిపోయిన అమ్మాయిల గతులు చదివి భయం వేసేది. వీణ్ణి కొన్నాళ్ళు భరించి చదువు పూర్తిచేసుకుంటే- అనుకున్నాను. నాకు ఒకే ఒక కోరికుంది పద్మా, నాకు పెళ్ళి కావాలి! భర్త, పిల్లలు, నాది అనుకునే యిల్లు కావాలి. కానీ నాకు ఈ జన్మకి అవి సాధ్యంకాదు కదూ?" అని ఏడ్చే జానకి గుర్తువచ్చింది. పద్మకి ఆ సూర్యం బాగా గుర్తు. నల్లగా, ఎత్తుగా వున్న మూతితో జానకితో సరసాలాడే కోతిలాంటి సూర్యం గుర్తువచ్చి ఏవగింపు కలిగింది.

బస్ ఎలెన్‌ఫారెస్ట్‌ముందు ఆగింది. ఆ రోజు ఆదివారం కావడంతో జనం గుంపులు, గుంపులుగా గేట్‌దగ్గర వున్నారు.

గేట్ దగ్గర బండిలో వేరుశెనక్కాయలు, నారింజపళ్ళు, అరటి పళ్ళు అమ్ముతున్నారు. ఎటు చూసినా రకరకాల డ్రెస్‌లలో జన సముద్రం! యిలాంటి సందర్భాల్లోనే పద్మకి పెరిగి పోతున్న జనాభా గుర్తు కొస్తుంది. ఎవరి చేతుల్లో చూసినా చంటి పిల్లలతో ఆడవాళ్ళు పద్మకి విరక్తి లాంటిది కలగసాగింది.

గేట్‌దగ్గర ఎంట్రన్స్‌ముందు హడావుడి, రణగొణధ్వని, ఈ యు.పి. సైడ్ వాళ్ళకి పిల్లలు యెక్కువ. వీళ్ళకి మగపిల్లల పిచ్చి. ఒక మగపిల్లాడు! పదిమంది ఆడపిల్లలు వున్నా సరే యింకా మగపిల్లాడికోసం యెదురు చూస్తారు, ప్రతి కుటుంబంలో, పరిమిత కుటుంబం వుండాల్సిన ఈ రోజుల్లోకూడా ఆరుగురు పిల్లలు! ఈ లెక్కన ఈ జనంకోసం యెంత పండించాలి? కరువు రాక ఏమవుతుంది? అనుకుంటూంది పద్మ. ఆ జనప్రవాహాన్ని చూస్తూ వుంటే ఏదో భావం చికాకుగా కదులుతూంది. కథల్లోలా సున్నితమైన అమ్మాయిలు, అపురూపమైన హీరోలు వీళ్ళు కాకపోగా, నల్లగా వున్నవాళ్ళు, తెల్లగా వున్న కళలేని వాళ్ళు, భారీ శరీరాల వాళ్ళు, సన్నగా ఎముకలు పీక్కుపోయినట్లుగా దవడలు కనిపించేవాళ్ళు, బిడియస్తులు, డేగ చూపుల వాళ్ళు, పోజులు కొట్టేవాళ్ళు, వెకిలిగా ప్రవర్తించే వాళ్ళు-- చూస్తూంటే ఆ ఫారెస్ట్‌కి జంతువుల్ని చూడడానికి కాక మనుష్యులు మనుష్యుల్ని గమనించడానికే వెళ్తున్నట్టుగా వుంది.

ఎంట్రెన్స్ దాటి లోపల ప్రవేశించగానే పద్మకి హాయి అనిపించింది. ఎటుచూసినా ఆకుపచ్చని చెట్లు, చల్లనిగాలి, ఫిబ్రవరి వచ్చినా ఆ చెట్లమధ్య యింకా చలి అనిపిస్తూంది.

పద్మ షాల్‌తీసి కప్పుకుంది. ఈ యు.పి. సైడ్ విపరీతమైన చలి. కొత్తగా వచ్చిన ఆంధ్రులు ఈ చలికి తట్టుకోలేరు. కొంచెం దూరం వెళ్ళేసరికి ఎడమవైపు దూరంగా గొలుసులతో కట్టబడిన ఏనుగులు ఆరు, ఏడు కనిపించాయి. పద్మ ఒక గుంపుని ఆసక్తిగా చూసూ ముందుకి సాగింది ఏనుగులు దాటాక సన్నని ఇనుప వలలతో కట్టబడిన గదుల్లాంటిచోట్లవరసగా

పచ్చిపులుసు
వెంకట సన్నయ్య
అండ్ సన్
25.8.77, మెయిన్‌రోడ్,
విశాఖపట్టణం-1.


Stockist :
Ayurvedasaram P. Ltd,
MADRAS

Specialist :
Ayurvedic Drugs Roots

Licence Holder :
Sulphar Safetyfuse Etc.

ఎనిమిది గదుల్లో రకరకాల కోతులు. ఎండి పోయిన చెట్టు ప్రతి గదిలోనూ వుంది. కొన్ని కోతులు కొమ్మల మీద కూర్చుని పేలు చూసుకుంటున్నాయి. వాటి చేష్టలు. ప్రవర్తన. ఆకారం ఎంతో ఆసక్తిగా నవ్వు పుట్టిస్తాయి కొన్ని ఆఫ్రికన్ కోతులు పెద్ద మొహాలతో మనిషికి దగ్గరగా అనిపిస్తున్నాయి.

అవి వున్న గదులు శుభ్రంచేసి యెన్నాళ్ళయిందో! వాటినిండా వాటి వుచ్చలు. దొడ్డతో కుళ్ళుకంపు వస్తున్నాయి. వాంతి రాబోయి పద్మ కొంగు అడ్డం పెట్టుకుని దూరంగా నిల్చుంది. వాటికి మంచినీళ్ళ కోసం పెట్టిన నీళ్ళుకూడా నల్లగా, మురికిగా వున్నాయి. పద్మకి జాలికలిగింది అడవులో చెట్లమధ్య స్వేచ్ఛగా తిరిగే వీటిని పట్టి బంధించి ఈ గూరికి కుళ్ళు మధ్య పారేసి మనిషి వినోదిస్తున్నాడు. నిజంగా మనిషికి యెంత స్వార్థం? పక్షుల్ని, కోళ్ళని, మేకల్ని తింటాడు. గేదెలు, ఆవుల చేత చాకిరీ చేయిస్తాడు. తోళ్ళకోసం, చర్మాలకోసం నిర్దాక్షిణ్యంగా జంతువుల్ని చంపుతాడు. వేట, వినోదం పేరుతో పక్షుల్ని కాల్చి చంపి అవి విలవిలలాడుతూంటె ఆనందిస్తాడు. అలాంటిది తనకి చిన్న జబ్బు చేస్తే, చిన్నకష్టంవస్తే, తన పిల్లల కేమైనా అయితే విలవిల్లాడిపోతాడు. తోటి మనుష్యుల్ని.కష్టాల్ని కథలుగా రాస్తాడు. వర్ణిసాడు. ఈ జంతువుల కష్టసుఖాల్ని, బాధల్ని ఎవరు పటించుకుంటారు? వాటి తల్లీ పిల్లల్ని అవలీలగా వేరు చేస్తాడు.



"ఇస్ ఝుండేకే నీచే...."

చిత్రం : పి. పెంచలయ్య, మహమ్మదాపురం

వరుసగా చూస్తూ వెళ్తున్న పద్మకి చివరి గదిలో ఆ వలలాంటి యినుప కమ్మీల్ని పట్టుకుని ఆకాశం వంక చూస్తూ హృదయ విదారకంగా పెద్ద పెట్టున ఏడుస్తున్నట్టుగా అరుస్తున్న నల్లని ఆఫ్రికన్ కోతిని చూసి మనసు బాధపడింది. అది ఒక్క చేత్తో యినుప కమ్మీని పట్టుకుని వేళ్ళాడుతూంది.

"దాన్ని కొత్తగా తెచ్చారుట" అన్నారు ఎవరో. అది ఈ చిన్ని వాతావరణంలో బందీ అయిపోయి ఏడుస్తూందేమో! పిల్లలకి, పెద్దవాళ్ళకి దాని ఏడుపు తమాషాగా నవ్వు పుట్టిస్తూంది. రాళ్ళు విసిరి దాన్ని మరింత ఏడిపిస్తున్నారు. "జంతువుల్ని దయచేసి దయతో చూడండి" లాంటి బోర్డులు ఫారెస్ట్‌లో పెటబడి వున్నా వాటి సంగతి ఎవరూ పట్టించుకోవడం లేదు.

తర్వాత రకరకాల పక్షులు, అందమైన నెమళ్ళు చూసింది పద్మ. వాటిల్లో తెల్ల నెమలి ఆమెని బాగా ఆకర్షించింది.

పన్నెండుగంటలకి పద్మ కొండచిలువని చూస్తూంది. చూస్తూండగానే ఫారెస్ట్‌వాళ్ళ ఆ కొండచిలువ ఆహారానికి దానిగదిలో చిన్ని తెల్లకుందేలుని వదిలారు. నల్లగా నిగనిగలాడుతూన్న ఆ భయంకరమైన కొండచిలువ గిజగిజలాడుతూన్న ఆ అందమైన చిన్న కుందేలుని మింగుతూంటె దుఃఖంతో పద్మ గొంతు పూడిపోయింది. ఒక మనిషిని మరో మనిషి చంపితే హత్య అంటూ కేసులుబెట్టి, పత్రికల్లో వేసి నానా హంగామా చేస్తారు. ఆ చిన్ని కుందేలుని సజీవంగా ఎలా వదిలారు? దాని ప్రాణం మీద హక్కు దానికిలేదు. సున్నిత హృదయిని అయిన పద్మకి కన్నీళ్ళు గిర్రున తిరిగాయి. ఆ ఫారెస్ట్‌లో ఏ జంతువుని చూసినా పద్మ కళ్ళకి చిక్కిపోయినట్టుగా దీనంగా చూస్తున్నట్టుగా అనిపించింది.

తర్వాత నక్కలు, చిఱుత పులులు, చాఱల పులి. జిరాఫీ, సింహాలు, అన్నీ తిరిగి చూసేసరికి పద్మ కాళ్ళు నొప్పి పుట్టసాగినాయి. భోజనాలు ఏర్పాటు చేశారు. పూరీలు, పులిహోర, నిమ్మకాయ పచ్చడి అరటి ఆకుల్లో వరుసగా క్యూలో యిస్తున్నారు. కొంత మంది పేకాడు

జీవితంలో డబ్బే ప్రాణమనుకున్న మేనకకు హరికృష్ణ రాకతో ప్రేమవైభవం అనిపించింది.
డబ్బుకు,ప్రేమకు అనాదిగా జరుగుతున్న ఈ సంఘర్షణకు అద్దం పట్టిన డైరెక్టు నవల—
శ్రీమతి యద్దనపూడి సులోచనారాణి
నీరాజనం
వెల:రూ.15/-
(ఆగస్టు 30 విడుదల)
అన్ని షాపుల్లోనూ దొరుకుతుంది.
లేదా ఒక రూపాయి తగ్గించి M.O. చేయండి. (ఆ రూపాయికి V.P. పంపుతాము.)
క్వాలిటీ పబ్లిషర్స్ రామమందిరం వీధి, విజయవాడ-520002

తున్నారు. కొంతమంది స్టూడెంట్స్ రింగ్ ఆడుతున్నారు. కొంతమంది ఫారెస్ట్ తిరగ డానికి వెళ్ళారు. కొంత మంది గ్రూప్స్‌గా ఏర్పడి కబుర్లు చెప్పుకుంటున్నారు. రాఘవరావుని యెవరో "క్యూలో రెండో సారికూడా నిలబడకండి" అని జోక్ చేస్తు న్నారు. తన ఆకు తెచ్చుకుని మీనాక్షి ప్రక్కన కూర్చున్న పద్మ తలెత్తి చూసే సరికి ఎదురుగా కొంచెం దూరంగా విశాలమైన యినుప వల అల్లిన బోనులో అరుగుపై ఠీవిగా కూర్చుని కళ్ళు వేదాంతిలా మూసుకుని తనని చూడవచ్చే జనంతో తనకేమాత్రం సంబంధం లేనట్టుగా కూర్చున్న నల్ల చుక్కల పులి కనిపించింది. దాన్ని చూస్తే అది క్రూర జంతువైనా ఎంతో జాలి కలుగుతూంది. దానికి తిండి పెట్టారో, లేదో అనుకుంది పద్మ. వేరుశెనక్కాయలు వేస్తే ఆవురావురుమని తినే అల్సేషియన్ కుక్కల్లాంటి నక్కలు గుర్తువచ్చాయి. పేగులు కనిపిస్తూన్న ఆ జంతువుల్ని చూసి ఫారెస్ట్ వాళ్ళు వాటికి పాపం సరిగ్గా తిండి పెడతారో, లేదో అనుకుంది పద్మ.

పద్మకి హఠాత్తుగా రహస్యంగా ఆ పులి తప్పించుకుంటే ఈ జనం ఎలా ప్రవర్తిస్తారు? అని ఆలోచన వచ్చింది. పూర్వం ముప్పైవేల పులులు వుండేవిట.

## నిమ్మతొనలు!

తలుపులులేని సదనం ముందు
ముగ్గులు వెదికేవాడినేమందు?
పుచ్చేసుకున్నాడనుకోవాలి-మందు!

—'మాధవీ సనారా'

ఈనాడు రెండువేలు కూడా ఇండియాలో లేవని పద్మ ఏదో మేగ్‌జైన్‌లో చదివింది. కొన్నాళ్ళకి ఈ జంతువులన్నీ అంతరించి పోతాయి. ఎటు చూసినా మనుష్యులే వుంటారేమో అనిపించింది.

మధ్యాహ్నం కొన్ని గేమ్స్ ఏర్పాటు చేశారు. ఆడవాళ్ళకి చైర్స్ ఆట. చైర్స్ బదులు విస్తర్లు పెట్టి ఆడించారు. గెలిచిన వాళ్ళకి బహుమతులుకూడా యిచ్చారు.

చీకటిపడుతూండగా తిరిగి వస్తూంటే మొదలు ఉదయం చూసిన ఆఫ్రికన్ కోతి యింకా ఆకాశంలోకి చూస్తూ అలాగే ఏడుస్తోంది. దాని ఏడుపు ఫారెస్ట్ అంతా చెట్ల మధ్య ప్రతిధ్వనిస్తోంది హృదయ విదారకంగా.

"అది యింక ఎక్కువ కాలం బత కదు" అన్నారెవరో! పద్మ గుండె ఏదో తెలియని దిగులుతో ఝల్లుమంది.

తిరిగి బస్ దగ్గరకి బయల్దేరి వస్తున్నారు. ఎప్పుడా అని ఎదురు చూసిన పిక్నిక్ చాలా త్వరగా అయిపోయినట్టుగా వుంది.

పద్మ భారమైన మనసుతో నడుస్తూంది!

రవిచంద్ర మధురిమ వంక చూస్తూ వస్తున్నాడు!

మీనాక్షి తలదించుకుని పద్మపక్క నడు స్తోంది!

లీలావతి పైట సర్దుకుంటూ వెళ్తోంది శేషాద్రిగారితో!

నీరజ తనవంక అనుమానంగా చూస్తూన్న భర్త చూపుల్ని తప్పించు కుంటూ నడుస్తూంది.

కొంచెం దూరంగా చేతులు వెనక పట్టు కుని సింహంలా గంభీరంగా నడుస్తు న్నారు గోపాలరావుగారు!

టీ బడ్డీ దగ్గర ఆగిన ఫ్రెండ్‌వైపు వెళ్తున్నాడు రాఘవరావు!

పద్మకి ఎన్నో ఆలోచనలువస్తున్నాయి:

—ఈ ప్రపంచం కూడా ఎలెన్ ఫారెస్ట్ వంటిదే! యిందులో రకరకాల స్వభావాల వాళ్ళు! సింహాల్లాంటి గోపాలరావులు, కుందేలు పిల్లల్లాంటి జానకీలూ, నెమళ్ళ లాంటిమీనాక్షులూ, నక్కల్లాంటి సూర్యాలూ కోతుల్లాంటి రాఘవరావులూ............ ఎన్నో రకాలవాళ్ళు!


జ్యోతిచిత్ర

పాఠకులకు ముళ్లపూడి నవ /లా/ మా కం

వంశవృక్షం

సంక్షిప్త చిత్రకథ వచ్చేసంచిక నుంచి ప్రారంభం.



నేడే మీ కాపీ రిజర్వు చేసుకోండి

వెల: మామూలే!